క్లుప్తంగా

అసిస్టెంట్ సర్వేయర్ల కోసం శిక్షణ

జమ్మలమడుగు : నియోజకవర్గంలోని నిరుద్యోగులకు న్యాక్ సెంటర్ ద్వారా అసిస్టెంట్ సర్వేయర్‌ల శిక్షణ ఇవ్వడం జరుగుతుందని న్యాక్ సెంటర్ అధికారి రాకేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా ఇంటర్మీడియట్, ఐటీఐ డిప్లమా చదువుకున్న అభ్యర్థులను ఎంపిక చేస్తారన్నారు. అభ్యర్థులు 6వ తేదీలోపు హాజరుకావాలన్నారు. 120 రోజుల పాటు సాగే ఈ శిక్షణ కాలంలో ఉచిత వసతి, భోజనం కల్పిస్తారన్నారు. శిక్షణ అనంతరం కేంద్ర ప్రభుత్వం సర్టిఫికెట్‌లను ఇస్తారన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9985142155 నంబర్‌కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చునన్నారు.

వైద్య పరీక్షలపై ప్రజల్లో అవగాహన పెంచాలి

ముద్దనూరు : ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాల పరిధిలో చేపడుతున్న వివిధ రకాల వైద్య పరీక్షలపై ప్రజల్లో అవగాహన పెంచాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు ఆదేశించారు. మంగళవారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి మాట్లాడారు. క్యాన్సర్ పరీక్షలు చేయించుకునేలా ప్రజలను చైతన్య పరచాలని, వైరల్ జ్వరాలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్త వహించాలన్నారు. అనంతరం పీహెచ్‌సీ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

లింగాల : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కడప పట్టణానికి చెందిన పుష్పగిరి కంటి ఆసుపత్రి వారిచే ఉచిత కంటి పరీక్షల వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామ సర్పంచ్ దస్తగిరమ్మ ఆధ్వర్యంలో వైద్యులు మండలంలోని కంటి సమస్యలు ఉన్న ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 100మందికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లకు రెఫర్ చేసినట్లు డాక్టర్ మనోజ్ తెలిపారు. కార్యక్రమంలో భారతి ఫాలీమర్స్ జీఎం శ్రీనివాస్, వైద్యులు, ఎస్ఐ మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

వేంపల్లె : స్థానిక రాజీవ్ కాలనీలో ఉన్న అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో అనాథ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. మంగళవారం కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామానుజుల రెడ్డి పుట్టినరోజు సందర్భంగా వారి అభిమాన నాయకుడు దేరంగుల శీను వృద్ధులకు అన్నదానం చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

కమలాపురం : 2024–25 రబీలో సాగు చేసిన పంటలకు సస్యరక్షణ చర్యలు చేపట్టి అధిక దిగుబడులు సాధించాలని ఏడీఏ నరసింహారెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మండలంలోని దాదిరెడ్డిపల్లె, చిన్నచెప్పలిలో సాగులో ఉన్న మినుము శనగ పంటలను పరిశీలించారు. మినుము పంటలో మరుకా మచ్చల పురుగు ఉందని, దీనిని పూత పురుగు, లేక గూడు పురుగు అని కూడా అంటారని తెలిపారు. అలాగే తెల్లదోమ అధికంగా ఉందని తెలియజేశారు. ఈ దోమ అడుగు భాగంలో చేరి రసం పీల్చడం వలన మొక్కలు నీరసించి పోతాయన్నారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా రైతు సేవా కేంద్రాలకు వెళ్లి వీఏఏలను కలవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ దస్తగిరి, రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

పెండ్లిమర్రి : మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్ ఆకస్మికంగా తనిఖీచేసి పలురికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ అనురాధతో మాట్లాడుతూ ప్రజల వినతులు, విద్యార్థుల సర్టిఫికెట్‌లు, భూసమస్యలు ఎమైనా పెండింగ్ ఉంటే వెంటనే వాటిని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీను, వీఆర్వోలు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు నిధులు మంజూరు

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల మున్సిపల్ పరిధిలోని నాలుగు రోడ్లలో రోడ్డు విస్తరణ పనుల కోసం రూ.8 లక్షలు నిధులు మంజూరు చేశారని మున్సిపల్ కమిషనర్ శేషఫణి తెలిపారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడారు. అక్కడ సర్వే నిర్వహించి మార్కింగ్ ఇచ్చామన్నారు. మార్కింగ్ ప్రకారం అక్కడ వ్యాపారస్తులకు తోపుడు బండ్లను తొలగించాలని సూచించామన్నారు. మంగళవారం తాత్కాలికంగా అక్రమణలు తొలగించామని త్వరలోనే రోడ్డు విస్తరణ పనులు చేపడుతామన్నారు.

జాగ్రత్తలు పాటించి అధిక దిగుబడులు సాధించండి

కమలాపురం : రైతులు తాము సాగు చేసిన పంట పొలాల్లో జాగ్రత్తలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏఓ సరస్వతి తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నచెప్పలి, బయనపల్లె, రాజుపాళెం గ్రామాలలో జరిగిన పొలం పిలుస్తోంది.. కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రైతులకు సలహాలు సూచనలు అందజేశారు. ప్రతి రైతు ఇ-క్రాప్ బుకింగ్‌తో పాటు ఇ-కేవైసీ నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వీఏఏ సుప్రియ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది సోని, గంగాదేవి, రోజా, రైతులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు కడుపు కోత

ఎర్రగుంట్ల : నగర పంచాయతీ పరిధిలోని నాలుగు రోడ్ల కూడలిలో చాల ఏళ్ల నుంచి చిరు వ్యాపారస్తులు తోపుడు బండ్లపై వ్యాపారులు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. అయితే కూడలిలో రోడ్డు విస్తరణ పనులలో భాగంగా మున్సిపల్ అధికారులు వేంపల్లి రోడ్డు, కడప రోడ్డు, ముద్దనూరు రోడ్డులలో ఉన్న చిరు వ్యాపారస్తుల తోపుడు బండ్లలను తొలగించే పనులు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ శేషఫణి ఆదేశాల మేరకు టౌన్‌ప్లానర్స్ అధికారులు జేసీబీలతో వచ్చి తోపుడు బండ్లను తొలగించారు. చిరు వ్యాపారస్తులు ఆవేదనకు గురై మున్సిపల్ టౌనప్లానర్స్‌తో వాదనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేళ్లుగా ఈ స్థలంలోనే తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. మా ఉపాధిపై దెబ్బ కొట్టి మాకు కడుపు కోత మిగిలిస్తున్నారని మండి పడ్డారు. ముందు మాకు తోపుడు బండ్లను పెట్టుకోవడానికి స్థలం చూపించాలని డిమాండ్ చేశారు.


తోపుడు బండ్ల తొలగింపుపై కమిషనర్‌తో వాదిస్తున్న చిరు వ్యాపారస్తులు, అఖిల పక్ష నాయకులు


తోపుడు బండ్లను తొలగిస్తున్న మున్సిపల్ టౌన్ ప్లానర్స్


తోపుడు బండ్లను తొలగిస్తున్న జేసీబీ

ప్రమాదాల నివారణ కోసమే కూడలిలో విస్తరణ పనులు

నాలుగు రోడ్ల కూడలిలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కూడలిలో పెద్ద వాహనాలు టర్నింగ్ కోసమని విస్తరణ పనులు చేస్తున్నామన్నారు. చిరువ్యాపారస్తుల ఉపాధి కోసమని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణ వెనుక భాగంలో స్థలం చూపిస్తామని ముందు ఇక్కడ నుంచి ఖాళీ చేసి చిరువ్యాపారస్తులు సకహరించాలని కోరారు.

- మున్సిపల్ కమిషనర్ శేషఫణీ, ఎర్రగుంట్ల

చిరు వ్యాపారస్తులకు న్యాయం చేయాలి

మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ శేషఫణిని అఖిలపక్ష నాయకులు కలసి చిరువ్యాపారులకు న్యాయం చేయాలని చాలా సంవత్సరాల నుంచి ఇక్కడే తోపుడు బండ్లు పెట్టుకుని జీవనం సాగిస్తున్నారని ఆయనకు వినతి పత్రం అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ చిరు వ్యాపారస్తులకు కచ్చితంగా న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో అఖిల పక్ష పార్టీల నాయకులు, చిరు వ్యాపారస్తులు పాల్గొన్నారు.**- అఖిల పక్ష పార్టీల నాయకులు, ఎర్రగుంట్ల**

ఆన్‌లైన్‌లో 1బీలు వచ్చేలా చర్యలు తీసుకోవాలి

వేంపల్లె : పంటల ప్రీమియం చెల్లించేందుకు ఆన్‌లైన్‌లో 1బిలు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ హరినాథ్ రెడ్డికి రైతులు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మండలంలోని ముత్తుకూరు, నాగూరు, అయ్యవారిపల్లె, కత్తులూరు, అమ్మగారిపల్లె, రామిరెడ్డిపల్లి, పాములూరు గ్రామాల్లో గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం భూముల రీ సర్వే చేపట్టిందని, అయితే ఈ రీసర్వేవలన 60 శాతం మంది రైతులకు ల్యాండ్ పార్శిల్ మ్యాప్ (ఎల్‌పీఎం) నెంబర్లు ఇవ్వకపోవడంతో 1బి, ఆండగల్లు రావడం లేదన్నారు. అయితే ఈనెల 15లోగా రైతులు పంటల ప్రీమియం చెల్లించేందుకు గడువు ఉందన్నారు. అందుకు ప్రీమియం చెల్లించేందుకు వన్ బీ లేకుంటే ఆన్‌లైన్‌లో ప్రీమియం దరఖాస్తు తీసుకోవడం లేదన్నారు. మండలంలో ఎక్కువ శాతం మినుము పంట తెగుళ్ల సోకి రైతులు చాలా నష్టపోయారని, రీ సర్వే చేయించుకున్న రైతులకు వన్ బీ రాక పోవడంతో చాలా మంది రైతులు ప్రీమియం చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు. అందుకు తహశీల్దార్ స్పందించి తక్షణమే ఈ విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లి తమ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

జూదరులు అరెస్టు

వీరపునాయునిపల్లె : మండలంలోని కదిరేపల్లె వద్ద 7 మంది జూదరులను మంగళవారం అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.8700 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మంజునాథ్ తెలిపారు.

గుడిసెను అక్రమంగా తొలగించారు

కొండాపురం : స్థానిక ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న దాసరి రమణమ్మ తనకు చెందిన గుడిసెను అదే గ్రామానికి చెందిన బలిజ సుబ్బరాయుడు తొలగించాడని ఆమె మంగళవారం పోలీస్‌ల దృష్టికి తీసికెళ్లినట్లు తెలిపారు.

రేపటినుంచి రెవెన్యూ సదస్సులు

ముద్దనూరు : మండలంలో రెవెన్యూ సదస్సులు 5వ తేదీ నుంచి వచ్చే జనవరి 6వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు తహసీల్దారు వరదకిషోర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని 23 రెవెన్యూ గ్రామాల పరిధిలో ఈ రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు ఈనెల 5వ తేదీన కొసినేపల్లెలో రెవెన్యూ సదస్సులు ప్రారంభమవుతాయని ఈయన తెలిపారు.

గురుకుల పాఠశాల తనిఖీ

పులివెందుల టౌన్ : పులివెందులలో ఉన్న మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలను మంగళవారం ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన తోటి విద్యార్థులతో భోజనము వడ్డించటం పద్ధతి కాదన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం గురించి పాఠశాల విద్యార్థులను అడిగి తెలుసుకుని నాణ్యతను పరిశీలించి హాస్టల్ గదులను, మరుగుదొడ్లను పరిశీలించారు.

ఆరోగ్య సిబ్బందికి సూచనలు

తొండూరు : స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజా మొద్దీన్, వైద్యులు డాక్టర్ అరిపుల్లా, ఏఎంఓ వెంకటరెడ్డి, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సిద్ధయ్య, సూపర్‌వైజర్ రాఘవ పాల్గొన్నారు.

అరటి ఎగుమతులపై అవగాహన

పులివెందుల రూరల్ : పట్టణంలోని ఉద్యాన కార్యాలయంలో మంగళవారం అరటి ఎగుమతులపై రైతులకు, వ్యాపారస్తులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉద్యాన శాఖ అధికారిణి ఎస్.వి.సుభాషిణి మాట్లాడుతూ పులివెందుల అరటికి ఇతర దేశాలలో ఆగస్టు నుండి మార్చి 15వ తేదీ వరకు ఎక్కువ డిమాండ్ ఉంటుందన్నారు. అరటిలో నాణ్యతను పెంపొందించేందుకు, సిగటోక తెగులు నివారించేందుకు క్షేత్రస్థాయిలో రైతులకు శిక్షణ కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. పులివెందులలో కోల్డ్ స్టోరేజ్‌ను 125 మెట్రిక్ సామర్థ్యం గల ప్రీ కూలింగ్ ఛాంబర్‌లో అందుబాటులో ఉన్నాయన్నారు. పులివెందులలో ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఓ రాఘవేంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీతో ఇబ్బందులు పడుతన్నాం

కమలాపురం : ఇసుక క్వారీ ఏర్పాటు చేయడంతో తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని మండలంలోని మొలకవారిపల్లె గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తూ మంగళవారం మండల తహసీల్దార్ శివరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని గంగవరం పంచాయతీ విభరాపురం గ్రామంలో ప్రభుత్వం ఇసుక క్వారీ మంజూరు చేస్తే సంబటూరు పంచాయతీ మొలకవారిపల్లెలో ఇసుక తరలిస్తున్నారని ఆరోపించారు. జేసీబీ, హిటాచీలతో టిప్పర్లకు లోడింగ్ చేస్తున్నారన్నారు. గ్రామానికి అత్యంత సమీపంలో ఇప్పటికే పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, కనీసం 500–600 మీటర్ల దూరం ఉన్న ఇసుకను తరలించుకోవాలన్నారు. తాగు, సాగు నీటి బోర్లు ఉన్నాయని, ఇసుక తరలించడంతో తీవ్ర ఇబ్బందులు పడుతామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్వారీని తమ గ్రామం వద్ద లేకుండా ఇతర ప్రాంతాలకు మార్చాలని వారు కోరుతున్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మొలకవారి పల్లె గ్రామస్తులు

సస్యరక్షణ చర్యలతో తెగుళ్ల నివారణ

వల్లూరు : సరైన సస్యరక్షణ చర్యలు చేపట్టడం వలన పంటల్లో తెగుళ్లను నివారించుకోవచ్చునని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నరసింహారెడ్డి అన్నారు. మండలంలోని కొప్పోలు గ్రామంలో మంగళవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులు సాగు చేసిన మినుము, శనగ పంటను ఆయన పరిశీలించి మాట్లాడారు. మినుములో బూడిద తెగులు నివారణకు ఒక లీటరు నీటికి హెక్సా కొనజోల్ మందును 2 మిల్లీ లీటర్ల చొప్పున కలిపి పిచికారి చేయాలని సూచించారు. రబీలో సాగు చేసిన అన్ని పంటలకు తప్పని సరిగా ఇ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో సాయిజ్యోతి తెలిపారు. ఒక పంట సాగు చేసి మరో పంటకు బీమా ప్రీమియం చెల్లించినా, అసలు పంట సాగు చేయకుండానే పంటల బీమా ప్రీమియం చెల్లించినా ఎలాంటి ప్రయోజనం వుండదని తెలిపారు. కార్యక్రమంలో అగ్రికల్చర్ అసిస్టెంట్ సుబ్బనరసయ్య, రైతులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తే జరిమానా

పులివెందుల టౌన్ : ప్లాస్టిక్ కవర్లు వినియోగించినా, విక్రయించినా జరిమానాలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రాముడు తెలిపారు. మంగళవారం పట్టణంలో మొబైల్ వాహనం ద్వారా ప్రచారం చేశారు. ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, ప్లాస్టిక్ వర్లు, ప్లాస్టిక్ గ్లాసులను విక్రయించినట్లు తెలిస్తే చర్యలు తప్పవన్నారు. దీనికి ప్రతి వ్యాపారస్తుడు, వినియోగదారుడు సహకరించాలన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్ చర్యలు

పట్టణంలో దోమల నివారణకు మంగళవారం సాయంత్రం ఫాగింగ్ చర్యలు చేపట్టారు. మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో పారిశుధ్య సిబ్బంది ప్రత్యేక వాహనం ద్వారా పట్టణంలోని పలు వీధులలో దోమల నివారణకు పొగ మందును పిచికారి చేశారు.

ప్రారంభమైన శబరిమలై 8వ మహా పాదయాత్ర

పులివెందుల టౌన్ / లింగాల : లింగాల మండలం అంబకపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు బండి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో శబరిమలై 8వ మహా పాదయాత్ర ప్రారంభమైంది. మంగళవారం లింగాల మండలం అంబకపల్లె నుంచి ప్రారంభమైన ఈ మహా పాదయాత్ర పులివెందులకు చేరుకుంది. పాదయాత్ర పులివెందులకు చేరుకున్న సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు, పట్టణ ప్రజలు పాదయాత్ర బృందానికి ఘన స్వాగతం పలికారు. ఈ పాదయాత్ర వైఎస్ఆర్, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల మీదుగా 24 రోజుల పాటు కొనసాగనుండగా, మొత్తం 800 కి.మీల మేరా సాగనుంది.


పులివెందులకు చేరుకున్న శబరిమలై పాదయాత్రీకులతో అయ్యప్ప భక్తులు

ముగిసిన జిందేషా మదార్షా వలి ఉరుసు

వేంపల్లె : స్థానిక పాపాఘ్ని నది ఒడ్డున వెలసిన శ్రీ హజరత్ సయ్యద్ ఖ్వాజాదర్ బార్ జిందేషా మదార్షా వలి ఉరుసు మహోత్సవం మంగళవారం నాటితో ముగిశాయి. గత రెండు రోజులుగా దర్గా కమిటీ సభ్యులు నిర్వహించారు. గంధం రోజు జెండా మెరవణి జర్గా ఉరుసు రోజునైన సోమవారం రాత్రి ఖవ్వాళి పోటీలను నిర్వహించారు. ఏడాదికి ఒక సారి జరిగే ఉరుసు ఉత్సాహల్లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ఉల్లాసంగా చిన్న పిల్లలను తీసుకుని వెళ్లి ఆనందంగా గడిపారు. ఉరుసులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


ఉరుసు సందర్భంగా ఖవ్వాళి పోటీలలో రాబియా చిష్టి, మజమ్మిల్ దరాజ్‌లు

అయ్యప్పస్వామి గ్రామోత్సవం

కమలాపురం : పట్టణంలో అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని ఆలయ గురుస్వాములు నరసింహ శర్మ, నరసింహారెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామోత్సవంలో కన్నెసాములు కళశాలతో ఊరేగారు. ఉదయం ఆలయంలో గణపతి పూజ, గణపతి హోమం, ప్రధాన కలశ స్థాపన, ఉత్సవ విగ్రహానికి విశేష అభిషేకాలు, స్వామి వారికి విశేష పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు.

ఘనంగా అయ్యప్ప స్వామి అంబులం పూజ

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య హైస్కూల్ ఆవరణలో అయ్యప్ప స్వామి అంబులం పూజను ఘనంగా నిర్వహించారు. సోమవారం రాత్రి అయ్యప్పస్వాములు నిర్వహించిన అంబులం పూజలకు వేంపల్లెకు చెందిన గురు స్వాములు రామ్మోహన్, రామమునిరెడ్డిలు అభిషేకాలు చేసి ప్రత్యేక పూజలు చేశారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

లింగాల : జనవరి 5న విజయవాడలో జరిగే హైందవ శంఖారావ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ్ చాలక్ రామచంద్రారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని పార్నపల్లె కోనమల్లేశ్వరస్వామి ఆలయంలో భాగవత పఠనం ముగింపు సందర్భంగా ఆయన హైందవ శంఖారావ బహిరంగ సభ కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. ఈ సభకు లక్షలాది మంది హిందువులు తరలి వచ్చి విజయవంతం చేయాలన్నారు.

నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై సమీక్ష

లింగాల : నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్, ఎన్నికల అధికారి ఈశ్వరయ్య రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12 టీసీలకు సంబంధించి నీటి సంఘ సభ్యులను, ప్రెసిడెంట్లను, వైస్ ప్రెసిడెంట్ల ఎన్నికకు ఈనెల 5వ తేదీన నోటిఫికేషన్ వెలువడుతుందన్నారు. 8వ తేదీన ఎన్నికలు నిర్వహిస్తారన్నారు. ఈ ఎన్నికలకు సంబంధించి 12 టీసీలు ఉన్నాయన్నారు. కామసముద్రం టీసీ1, టీసీ2, రామాపురం, బలపనూరు టీసీ 8, టీసీ4, 5, 6, 7, దొండ్లవాగు–బలపనూరు టీసీ 8, బలపనూరు – తొండూరు టీసీ 9, మడూరు టీసీ 10, దొండ్లవాగు టీసీ 11, రాయలాపురం టీసీ 12 ఉన్నాయన్నారు. అధికారులు ఆయా టీసీల పరిధిలో పర్యటించి ఆయకట్టుదారులను నీటి సంఘ ఎన్నికలకు సిద్ధం చేయాలన్నారు. ఈ ఎన్నికలు ఈనెల 8వ తేదీన పెద్దకుడాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తారని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ ఈశ్వరయ్య

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

సింహాద్రిపురం : సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌ఓ నాగరాజు తెలిపారు. మంగళవారం కోవరంగుట్టపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆశా డే సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులకు ప్రజలు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని.. దోమకాటుకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాజా మొద్దీన్, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ నాగరాజు

ఘనంగా ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని చిన్నన్న రూముల రోడ్డులో ఉన్న భవిత స్కూలులో మంగళవారం అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సమగ్రశిక్ష, సమ్మిళిత విద్యా విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ వికలాంగుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలకు రూరల్ సీఐ ఎస్.వి.రమణ హాజరై దివ్యాంగుల స్ఫూర్తి ప్రదాత లూయిస్ బ్రెయిలీ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం దివ్యాంగులకు సంఘమిత్ర సేవాసంస్థ అధ్యక్షులు సిరాజుద్దీన్ సమకూర్చిన దుప్పట్లను పంపిణీ చేశారు. ఆటలు పోటీలలో విజేతలైన భవిత విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓలు రామానాయుడు, చంద్రశేఖరరావు, టీచర్లు ప్రకాశమ్మ, స్వాతి, కేర్ టేకర్ అరుణ పాల్గొన్నారు.


దివ్యాంగ చిన్నారులకు బహుమతులను ప్రదానం చేస్తున్న సీఐ, తదితరులు

వైఎస్ కుటుంబాన్ని నిందించడం సబబు కాదు

పులివెందుల టౌన్ : రాష్ట్రంలో ఎక్కడ ఏ సమస్య జరిగిన వైఎస్ కుటుంబానికి ఆపాదించడం కూటమి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని, ఎక్కడో సత్యసాయి జిల్లాలో జరిగిన సంఘటనను తీసుకొచ్చి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిపైన బురద చల్లడం దుర్మార్గమైన చర్య అన్నారు. గత 20 ఏళ్లుగా వైఎస్ అవినాష్‌రెడ్డి వ్యక్తిత్వం గురించి చాలా బాగా తెలుసు అని, ఆయన అటువంటి కార్యక్రమాలు పోత్సహించడని, అసలు సాయి అనే వ్యక్తి ఎవ్వరో కూడా మాకు తెలియదన్నారు. ఇంతకుమునుపు కూడా వైఎస్ మనోహర్‌రెడ్డిపైన సీఎం చంద్రబాబు దగ్గర కంప్లయింట్ చేసినట్లు ఆరోపణలు చేశారని, అది ఇంతవరకు నిరూపించలేక పోయారన్నారు. ఏదైనా పత్రికల్లో వార్త రాసే ముందు నిజానిజాలు తెలుసుకుని రాయాలని, కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు నెరవేర్చలేక, ప్రభుత్వాన్ని నడపలేక ప్రజలను మభ్య పెట్టడానికి రోజుకో డ్రామా ఆడుతూ డైవర్షన్ రాజకీయాలు చేస్తోందన్నారు. ప్రజలు బుద్ధి చెప్పే రోజు దగ్గరలోనే ఉందని పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు.

విద్యార్థులకు అన్నదానం

కమలాపురం : కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి 41వ జన్మదిన వేడుకల సందర్భంగా స్థానిక ఎయిమ్ ఫర్ సేవలో హార్టికల్చర్ స్టేట్ మాజీ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మన్ మారుజోళ్ల శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి అభిమానులకు పంచి పెట్టారు. రాత్రి వైఎస్సార్‌సీపీ మైనార్టీ స్టేట్ వైస్ ప్రెసిడెంట్ షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో పెద్ద దర్గాలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రిలో..

పెండ్లిమర్రి : వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం పెండ్లిమర్రిలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమణారెడ్డిల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బాస్కర్‌రెడ్డి, శ్రీనువాసులు, వైఎస్సా ర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఊటుకూరు రింగ్ రోడ్ వైఎస్సార్ సర్కిల్ వద్ద వైఎస్సార్‌సీపీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజనేయ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల ఉపాధ్యక్షుడు గజ్జల సుధాకర్‌రెడ్డి, వైఎస్ఆర్‌సీపీ మండల కన్వీనర్ గూడా ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ సురేంద్రనాథ్, బీసీ నాయకులు, మైనారిటీ నాయకులు వైయస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : స్థానిక వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ కార్యాలయంలో కమలాపురం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంగమేశ్వర దేవస్థానం మాజీ చైర్మెన్ నర్రెడ్డి శివాంజనేయరెడ్డి, వీరపునాయునిపల్లె ఎంపీటీసీ రాఘవయాదవ్‌లు పాల్గొన్నారు.

చెన్నూరులో..

వల్లూరు (చెన్నూరు) : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కమలాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి నరేన్ రామాంజులరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం చెన్నూరులో ఘనంగా నిర్వహించారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. లారెన్స్ వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం అందించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అన్నదానం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బడి వైపు ఒక అడుగు గురించి ముచ్చట్లు

సింహాద్రిపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో మంగళవారం ఎంపీడీవో కృష్ణమూర్తి ఆధ్వర్యంలో విద్యార్థుల తల్లిదండ్రులకు మెగా పీటీఎం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల స్పెషలాఫీసర్ సన్నన్న ఈనెల 7వ తేదీన జరిగే మెగా పీటీఎం సమావేశాలకు సంబంధించి ఎంపీడీఓ, ఎంఈఓ, హెడ్మాస్టర్లకు దిశా నిర్దేశాలు చేశారు. అనంతరం రిసోర్స్ పర్సన్ జగదీశ్వర్‌రెడ్డి హెడ్మాస్టర్లకు మెగా పీటీఎం సమావేశంపైన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో. ఆర్డినేటర్ అరవింద్, సిబ్బంది పాల్గొన్నారు.